www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 22 జులై 2025
5
చిత్తూరు



యాప్‌ల గోల మాకొద్దు..

అంగన్‌వాడీల ధర్నాలు విజయవంతం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంగన్‌వాడీల సేవల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ ధృవీకరణ యాప్‌ల రద్దు, అంగన్వాడీ కేంద్రాలకు కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లు, 4జి, 5జి మొబైల్‌ఫోన్లు, సుప్రీమ్ కోర్టు ఆదేశాల మేరకు ఎలాంటి ఆధార్ ధృవీకరణ లేకుండా లబ్ధిదారులకు అంగన్‌వాడీ పోషకాహారం ఇచ్చేలా చూడాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు చిత్తూరు జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల పరిధిలో అంగన్వాడీలు సోమవారం నిరసనలు వ్యక్తం చేశారు. సమస్యలతో కూడిన వినతి పత్రాలను ప్రాజెక్టు అధికారులకు అందించారు. ప్రభుత్వం తప్పని సరిగా లబ్ధిదార్ల వాటా యాప్‌లో నమోదు చేయడంతో పాటు పోషక ఆహారం ఇతర వివరాలను యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించడంతో అంగన్వాడీలు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని, ప్రభుత్వం అంగన్వాడీ లకు ఇచ్చి మొబైల్ ఫోన్లు మొరాయించడం, నెట్ పని చేయకపోవడంతో అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు అంగన్వాడీలకు నెలకు కనీస వేతనం రూ. 26వేలు చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేస్తూ ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు వర్తింపజేయాలంటూ వినతి ప్రతాలు అందించారు. జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసిన అంగన్వాడీలకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లలిత, షకిల అభినందనలు తెలిపారు.

కార్వేటినగరం: అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫేస్ యాప్‌ల భారాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ స్థానిక అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి విజయ, మమత డిమాండ్ చేశారు. సోమవారం కార్వేటినగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విజయ, నాగమ్మ, జీవ, సుధా, రాణి పలువురు అంగన్వాడీ కార్యకర్తలు, వర్కర్లు పాల్గొన్నారు.

విజయపురం: మినీ టీచర్ల జీవోని తక్షణమే ఇవ్వాలని, ఆప్స్‌ను సవరించి ఒకే ఆప్ చేయాలని, తక్షణమే గౌరవ వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటీ జీవోలో సవరణలు చేయాలని, ప్రధానమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, తక్షణమే సంఘాల నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించాలని నగరి అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల నగరి, నింద్ర, విజయపురం అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

పలమనేరు: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలమనేరులో ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ మూడు సంఘాలు (ఏఐటీయూసీ, సిఐటియు, ఐఎఫ్‌టియు)నాయకుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మూడు సంఘాల అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.





నగరిలో



కార్వేటినగరంలో



పలమనేరు పరిధిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజలపై విద్యుత్ భారాలు వద్దు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి
సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి పిలుపు

ప్రజాశక్తి- పలమనేరు: అదాని కంపెనీ ప్రయోజనాల కోసమే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని, ప్రజలపై భారాలు మోపే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి, సీపీఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు పిలుపు నిచ్చారు. పలమనేరులోని రాజహంస ఫంక్షన్ హాలులో సోమవారం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి, సీపీఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ గత ఎన్నికల సమయం లో లోకేష్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని పిలుపు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారం లోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లపై నోరు మెదపక పోవడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా ఈనెల 16 తేదీ నుండి ఆగస్టు 4 తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వ్యతిరేకిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు సిపిఎం మద్దతు ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమ్మె డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం చిత్తూరు జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి నాయకులు, మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అదాని కంపెనీల ప్రయోజనాలను పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. రేషన్ షాపుల్లో ప్రతినెల 1 తేదీ నుండి 15 తేదీవరకు సరుకులు పంపిణీ చేస్తామని చెప్పినా ఎక్కడ అమలు కాలేద న్నారు. జిల్లాలో సిపిఎం గుర్తించిన భూ సమస్య లపై, దళితుల సమస్యలపై మహిళపై అరాచకా లకు వ్యతిరేకంగా నిరంతరం ఆందోళన కార్యక్ర మాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ సమా వేశంలో సిపిఎం జిల్లా నాయకులు సురేంద్రన్, ఓబులరాజు, గిరిధర్ గుప్త, షకీలా, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి రమాదేవి

నేటి నుంచి పీ4 సర్వేపై గ్రామ సభలు

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్ : పేదరిక నిర్మూలన, స్వర్ణాంధ్ర విజన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పీ4 సర్వేపై ప్రతి వార్డు సచివాలయంలో మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహించాలని కమిషనర్ పి నరసింహ ప్రసాద్ చెప్పారు. ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ లోపల వార్డు సచివాలయాల పరిధిలో పీ4 సర్వేలో ఇదివరకే ఎంపిక చేసిన బంగారు కుటుంబాల జాబితాను గ్రామసభలో ప్రదర్శించాలన్నారు. ఆదాయపరంగా అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేసి జాబితా ప్రదర్శించా లన్నారు. ఈ జాబితాను గ్రామ సభలో ఆమోదం నిర్వహించి మార్పులు, చేర్పులు చేపట్టి అర్హులైన వారితో తుది జాబితాలో సిద్ధం చేయాలన్నారు. గ్రామ సభల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్యదర్శులు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలను పూర్తిస్థాయిలో నిర్వహించి తుది జాబితాను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 12 ఫిర్యాదులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు 12 సమస్యలు వచ్చినట్లు నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారు లతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్‌కు 8, రెవెన్యూక 2, ప్రజారోగ్య విభాగానికి 1, పింఛన సమస్యకు 1 చొప్పున మొత్తం 12 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టరు లోకేష్, ఎసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫారా స్పోర్ట్స్ అసోసియేషన్ పోటీలకు 12 మంది ఎంపిక

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఆగస్టు 9వ తేదీ విశాఖపట్నం లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ క్రీడా పోటీలకు చిత్తూరులో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామని ఫారా స్పోర్ట్స్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు టి మోహన్ బాబు తెలిపారు. సోమవారం చిత్తూరు నగరంలోని మెకానికల్ గ్రౌండ్ లో ఆరవ జూనియర్ సబ్ జూనియర్ రాష్ట్ర పారా ఆథెంటిక్ ఛాంపియన్‌షిప్ క్రీడల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రన్నింగ్, షాట్ పుట్, డిస్ త్రో, జావిలింగి త్రో, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ క్రీడలు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నాలుగు శాతం రిజర్వేషన్ వివిధ ఉద్యోగాల్లో కల్పిస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో విశాఖపట్నంలో జరిగే పోటీ లో గెలుపొందిన క్రీడాకారులు జాతీయస్థాయిలో పాల్గొంటారని తెలిపారు. చిత్తూరు జిల్లాలో జరిగిన క్రీడల్లో 12 మంది ఎంపిక అయ్యారని వీరు రాష్ట్రస్థాయిలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్, డిఎస్‌డిఓ బాలాజీ, వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మురళి పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ కార్మికురాలికి నివాళి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :
నగర పాలక సంస్థ పారిశుధ్య విభాగంలో రెగ్యులర్ పబ్లిక్ హెల్త్ కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న పద్మావతి మృతి చెందింది. నగర కమిషనర్ నరసింహ ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టరు పి లోకేష్‌లు ఆమెకు నివాళు లు అర్పించారు. జానకారపల్లి మస్టర్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పద్మావతి అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం చిత్తూరు కట్టమంచిలోని మృతురాలి నివాసానికి వెళ్లి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం తరపున మట్టి ఖర్చుల కింద రూ.25వేలు మృతురాలు కుమార్తెకు అందించారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాల ఆదుకుంటామని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, కార్మికులు మృతురాలికి నివాళులర్పించారు.

సర్వే పారదర్శకం

- మామిడి రైతులను ఆదుకుంటాం
- రూ.150 కోట్లు ఖాతాలకు జమ
- కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): సర్వే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ప్రత్యేక సమావేశం మందిరంలో జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడేల్, ఉద్యాన శాఖ డిడి మధుసూదన్, అగ్రికల్చర్, ఉద్యానవన, సెరికల్చర్, మండల స్థాయి అధికారులతో మామిడి పంటను వివిధ ఫ్యాక్టరీలకి తరలించిన రైతులు జాబితా సమగ్ర నివేదికపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు సేకరించిన మామిడికి రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న రూ.4 సబ్సిడీ మొత్తం రూ.150 కోట్లు రైతులు ఖాతాలకు జమ చేస్తామని తెలిపారు. తోతాపురి మామిడి రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న సబ్సిడీ దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత మండల అధికారులపై ఉందని తెలిపారు. జూన్ నెల వరకు సేకరించిన మామిడికి సంబంధించి సబ్సిడీ జులైలో, జులైలో సేకరిస్తున్న మామిడికి సంబంధించి సబ్సిడీ ఆగస్టులో రైతులు ఖాతాలోకి జమ చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు రైతుల ద్వారా సేకరించిన మామిడికి సంబంధించి రైతుల వివరాలు, వారు ప్రాసెసింగ్ యూనిట్లకు అందించిన మామిడి వివరాలను జాబితా రూపంలో తయారుచేసి మండల హార్టికల్చర్ అధికారులకు అందిస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో సేకరించి పంపిన రైతుల వివరాలు, తోతాపురి మామిడి తూకం, తదితర వివరాలను మండల అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు గ్రామ స్థాయిలోని విలేజ్ అగ్రికల్చర్ హార్టికల్చర్, విలేజ్ రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని రైతుల వద్దకు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి సరిచూసుకోవాలన్నారు. రైతుల బ్యాంకుల ఖాతాలకు సంబంధించి బ్యాంక్ వివరాలు, ఐఎఫ్ ఎస్ సి కోడ్, ఈ క్రాప్ పంటలను పరిశీలించాలని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు తరలించిన మామిడి రైతులకు ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందని తెలిపారు. అలాంటి నివేదికలు జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ర్యాంప్ డేటా రిచ్‌కి పది రోజుల లోపల పూర్తి చేయాలని, రొంపిచర్ల, పులిచెర్ల, బంగారుపాళ్యం, యాదమరి, సదుం, పలమనేరు మండలాల అధికారులతో సంబంధిత రైతుల వివరాలపై ఆరా తీశారు. 2.25 లక్షల మెట్రిక్ టన్నులతో కూడిన 22,435 మంది రైతుల డేటా మండల స్థాయి బృందాలకు పంపిణీ చేశామని, ఆర్ఎస్‌కె స్థాయిలో రైతుల వివరాలు ఆర్ఎస్‌కె ఇన్‌ఛార్జిలు, విలేజ్ రెవెన్యూ అధికారి పరిశీలించాలని, పరిశీలన అనంతరం మండల వారీగా రైతుల జాబితాను తయారు చేసి, ఎంఏఓ, హెచ్ఓ, తహశీల్దారు సంతకాలతో ధృవీకరించాలన్నారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ, సెరికల్చర్ జెడి పద్మావతి, మార్కెటింగ్ ఏడి పరమేశ్వరన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

అచ్యుతానందన్ ఓ ఆదర్శం

ప్రజాశక్తి -పుంగనూరు: నేటి రాజకీయాలకు కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ ఆదర్శంగా నిలుస్తారని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు ఎస్ సజ్జద్ బాషా అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కేరళ మాజీ ముఖ్యమంత్రి , సిపిఎం నాయకుడు విఎస్ అచ్యుతానందన్ 102 ఏళ్ల వయస్సు లో మృతి చెందడం బాధాకరం అని సోమవారం తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అత్యంత సీనియర్ నాయకుడైన కేరళ ప్రజల్లో మంచి పేరు ప్రఖ్యాత లు పొందారన్నారు. 2006 నుండి 2011వరకు ఆయన ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. 81 సంవత్సరాల వయసులో కేరళ ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అవినీతి నిరోధక చర్యలు చేపట్టా రన్నారు. ఆయన తన సాధారణ జీవనం అవినీతిపై నిరంతరం పోరాటం, ప్రజల పక్షాన నిలబడటం వంటి లక్షణాలతో ప్రజల్లో గుర్తింపు పొందారన్నారు. నేటి రాజకీయ నాయకులు ఇలాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలి అన్నారు. ఆయన కేరళ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారన్నారు.

జీవన ఎరువులతో పంటకు బలం: కలెక్టర్



ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): జీవన ఎరువులతో పంటకు బలం అని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ అమలలో భాగంగా కలెక్టరేట్లో సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పచ్చి రొట్ట పైర్లను వాడటం ద్వారా 25 శాతం ఎరువులు ఆదా అనే గోడపత్రికను కలెక్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టర్ జి విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పడాల్ డి ఆర్ ఓ మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ జెడి మురళి పాల్గొన్నారు.

ప్రజలకు పక్కాగా నీటి సరఫరా : కమిషనర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ప్రజలకు నీటి సరఫరా పక్కాగా చేయాలని కమిషనర్ పి నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కమిషనర్ కొంగారెడ్డిపల్లిలోని ఈఎల్ఎస్ఆర్ ట్యాంక్ తనిఖీ చేశారు. ట్యాంకును క్రమం తప్పకుండా శుభ్రం చేస్తున్నారా? క్లోరినేషన్ సక్రమంగా చేస్తున్నారా తనిఖీ చేశారు. ట్యాంక్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి సరఫరా సక్రమంగా, సరిపోయేంత చేయాలని, నీటి నాణ్యత తగ్గకుండా చూడాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మోటార్ల పనితీరు ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని, అదనపు మోటార్లు అందుబాటులో ఉంచు కోవాలన్నారు. అనంతరం వెంకటేశ్వర కాలనీ, చెన్నారెడ్డి కాలనీలో స్థానికులతో మాట్లాడారు. నీటి సరఫరా తీరుపై ఆరా తీశారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా వ్యవస్థ పక్కాగా పర్యవేక్షించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఏఈ లోకేష్ ఉన్నారు.


పోలీస్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:
అనారోగ్యంతో ఈనెల 8వ ఏది ఎస్ఆర్‌పురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన ప్రదీప్‌కుమార్ సతీమణి భువనేశ్వరికి సోమవారం ఎస్‌పీ పోలీస్ సహాయ నిధి నుండీ 1 లక్ష రూపాయల చెక్కును ఎస్పీ మణికంఠ చందోలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధిత కుటుంబానికి భరోసా ఇస్తూ, పోలీస్ డిపార్టుమెంట్ తరపున వారికి అన్ని విధాల సహాయం అందిస్తామని తెలిపారు. అదనంగా, మతుడి కుటుంబానికి ప్రభుత్వం అందించే అన్ని న్యాయమైన సౌకర్యాలు, ఫలితాలు కూడా సమర్థవంతంగా పొందేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : పిజిఆర్ఎస్ లో అందిన అర్జీల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దష్టి సారించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పి.జి.ఆర్.యస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను కలెక్టర్ సుమిత్ కుమార్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్ వారితో పాటు జిల్లా జాయింటు కలెక్టరు జి. విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్ తో పాటు ప్రజల నుంచి అర్జీ స్వీకరించే కార్యక్రమంలో డి ఆర్ ఓ మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన అర్జీలను నాణ్యతతో గడువులోగా పరిష్కారం చూపాలని, ఎలాంటి అలసత్వం ఉండరాదని తెలిపారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన, నాణ్యమైన పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబందిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని ఆదేశించారు. జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించాలన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో మొత్తం 194 అర్జీలు రాగా శాఖల వారీగా రెవిన్యూ కు సంబంధించి 147, పోలీస్ 6, పంచాయతీరాజ్ 1, విద్యాశాఖ 1, ఐసిడిఎస్ 3, డి ఎస్ డి ఓ 1, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ 1, డిఆర్డిఏ 19, విద్యుత్ శాఖ 4, పౌరసరఫల శాఖ 3, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 2, గురుకులం 2, సర్వ శిక్ష అభియాన్ 2, నేషనల్ హైవే 1, గహనిర్మాణ సంస్థ 1 వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, డి ఆర్ ఓ, ఆర్ డి ఓ, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మిలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిద శాఖలకు సంబందించిన అధికారులు పాల్గొన్నారు.



వైసిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి- వెదురుకుప్పం: వైసిపి మండల అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టుకు నిరసనగా మండల వైసిపి నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: ఎంపీ వి మిథున్ రెడ్డి అరెస్ట్ టిడిపి ప్రభుత్వ కుట్రేనని వైసిపిని దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే ఈ చర్య అని దీన్ని ఖండిస్తున్నామని వైసిపి గంగాధర నెల్లూరు నియోజకవర్గం, బూత్ కమిటీ కన్వీనర్ బోడి రెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.

గంగాధర నెల్లూరు: ఎంపీ మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తున్నామని వైసిపి మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్రిక విలేకరు లతో ఎంపీగా గెలిచిన మిథున్ రెడ్డిని కక్ష పూరితంగా అరెస్టు చేయడం చాలా దారుణం అన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి ప్రశ్నిస్తే కేసులు పెట్టడం కూటమి ప్రభుత్వం ఇలా అక్రమ అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు గుణశేఖర్ రెడ్డి, చిన్నమరెడ్డి, ముని రాజరెడ్డి, ఏకాంబరం, వెంకటేష్ రెడ్డి, రూపకుమార్ రెడ్డి, లక్ష్మీ కరరెడ్డి, రఘుపతి రెడ్డి, కుట్టి పాల్గొన్నారు.

పుంగనూరు: ఎంపి మిథున్ రెడ్డి అరెస్టును ఖండిస్తూ పుంగనూరు ప్రైవేటు బస్టాండ్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు వైసిపి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో సోమవారం నిరసన, ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్, జడ్పిటిసి జ్ఞాన ప్రసన్న చంద్రారెడ్డి యాదవ్, నాగభూషణం, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, ఆవుల అమర, ఫక్రుద్దీన్ షరీఫ్, జయ రామిరెడ్డి, మాజీ ఎంపీపీ నరసింహులు, శేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

పలమనేరు: మిథున్ రెడ్డి అరెస్టు నిరసిస్తూ వైసిపి నాయకులు కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.



పలమనేరులో



వెదురుకుప్పంలో

రొంపిచర్ల : ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం తగదని రొంపిచర్ల ఎంపిపి చిచిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. మిథున్ రెడ్డి అరెస్టుపై చిచిలి వారి పల్లిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి కోటా వెంకట రమణ, మండల కన్వీనర్ కరీముల్లా, నాయకులు విజయ శేఖర్, సురేంద్ర నాయుడు, రవీంద్రనాథ్ రెడ్డి, గురు, మహబూబ్ బాషా, సుధాకర్ రెడ్డి, శ్రీనాథ నాయుడు, బావ జాన్, ఓబులేష్ పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: వైసిపి నేతలపై కుటమి ప్రభుత్వం కక్షపూరితంగా అక్రమ అరెస్టులకు పూనుకోవాడాన్ని నిరసిస్తూ సోమవారం గాంధీ విగ్రహం ఎదుట వైసిపి చిత్తూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయా నందరెడ్డి నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జ్ఞానజగదీష్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్. మహిళా నాయకురాలు గాయత్రిదేవి, కెపి శ్రీధర్‌లతో పాటు పలువురు నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

విద్యపై మక్కువ పెంచుకోవాలి: ఎంఈవో

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: విద్యపై మక్కువ పెంచుకోవాలని ఎంఈవో నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మొగిలి మిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈశ్వర్ కళ్యాణ్ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య వినయం నేర్పుతుందని విద్య నేర్చుకున్న వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమం లో ఎంఈవో 2 రమేష్ బాబు, కళ్యాణ్ ఫౌండేషన్ అది నేతలు మమత, ఈశ్వర్ నాయుడు, కళ్యాణ్, ప్రధానోపాధ్యాయులు చంద్రిక పలువురు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


క్లస్టర్ రిసోర్స్ సెంటర్ కార్యదర్శిగా వెంకమరాజు



ప్రజాశక్తి -విజయపురం: విజయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్లస్టర్ రిసోర్స్ సెంటర్ కార్యదర్శిగా శ్రీహరిపురం ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు ను ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల విద్యాశాఖ అధికారి, హరిప్రసాద్ వర్మ, సిఆర్‌సి ప్రధానోపాధ్యాయురాలు సుమతి పేర్కొన్నారు. క్లస్టర్ రిసోర్స్ సెంటర్ ను ఉపాధ్యాయుల విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని సిఆర్‌సి కార్యదర్శి వెంకమరాజు పేర్కొన్నారు. వెంకమరాజు ఎన్నికపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

కృష్ణమ నాయుడుకు ఘన సన్మానం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలానికి చెందిన పలువురు నాయకులు చిత్తూరులో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణమ నాయుడు నివాసంలో ఘనంగా సన్మానించారు. చిత్తూరు లోని ఆయన సొంత గృహానికి వెళ్లి ఆయనకు పుష్ప గుచ్ఛం అందించి శాలువ తో ఘన సన్మానం చేశారు. కృష్ణమ నాయుడు మాట్లాడుతూ ఈ పదవితో తనకు మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోమవారం పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణమ నాయుడుని సన్మానించినవారు జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, టిడిపి యువ నాయకుడు వినోద్ నాయుడు, మాజీ సింగిల్ విండో ఉపాధ్యక్షుడు బాబు నాయుడు, దేవ సుందరం, శాంత్ కుమార్, జీవరత్నం, నీరజాక్షులరెడ్డి, సంపత్, గోపి, తదితరులు పాల్గొన్నారు.


కృష్ణమనాయుడును సన్మానిస్తున్న యువనాయకుడు వినోద్‌నాయుడు

గుండె పోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: గుండె పోటుతో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని మేదర్ వీధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. రమేష్ నాయుడు ఎగువ రాగి మానిపెంట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయు లుగా పనిచేస్తున్నారు. ఆదివారం అనారోగ్య సమస్య కారణంగా మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.


రమేష్ నాయుడు (ఫైల్‌ఫోటో)

తొమ్మిది ఫిర్యాదులు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమలలోని తహశీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 9 ఫిర్యాదులు అందాయని తహశీల్దార్ మధుసూదన్ తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం కోసం ఐదు, వివిధ కోర్టులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సమస్యలపై రెండు, దారి సమస్యలపై రెండు అర్జీలు వచ్చాయని వాటిని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని తహశీల్దారు తెలిపారు.

సచివాలయంలో గ్రామసభ

ప్రజాశక్తి- రొంపిచర్ల:

రొంపిచర్ల మండలం బండ కింద పల్లి గ్రామ సచివాలయంలో సోమవారం రొంపిచర్ల ఎంపీడీవో ఎస్ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ బంగారు కుటుంబం అర్హత ప్రమాణాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఎల్‌పిజి లేని కుటుంబ సంప్రదాయ ఇంధనాన్ని వాడుతున్న వారు, విద్యుత్ లేని కుటుంబం, ఆదాయం లేని కుటుంబం, బ్యాంకు ఖాతా లేని కుటుంబం , ఉద్యోగం పెన్షన్ వంటివి ఏవి లేనివారు అర్హులన్నారు. ఐదు ఎకరాల భూమి ఉన్న, కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నా, పట్టణ ప్రాంతాల్లో ఆస్తులు కలిగి వున్నా ఆదాయ పన్ను చెల్లించే వారు ఎవరైనా, నాలుగు చక్రాల వాహనం కలిగి ఉన్న, 200 యూనిట్లు కన్నా ఎక్కువ విద్యుత్ వినియోగించేవారు అనర్హులు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వెంకటరమణ, సర్పంచ్ ఆన్సర్ భాష, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : స్థానిక ఓంశక్తి ఆలయంలో సోమవారం పాదయాత్ర గోవింద భక్తులకు అన్నదానం చేశారు. తమిళనాడు దిండివనం నుండి తిరుమల వెల్లే పాదయాత్రల భక్తులకు ఆలయంలో ఎల్‌కెఆర్ జ్యువలరీ అధినేత రామ్ కుమార్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల క్యూ

గంటలు తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పట్టణంలో భారీగా యూరియా కొరత ఉన్నదని రెండు రోజుల నుంచి ఎరువుల దుకాణాల వద్ద భారీగా రైతులు క్యూ కడుతున్నారు. 'దుకాణదారులు యూరియా తక్కువ పరిమాణంలో సప్లై ఉందని దానికి ప్రత్యామ్నాయంగా కాంప్లెక్స్ సిఫార్సు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు ఇంతకు మునుపులాగా రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ చేస్తే మాకు కాలయాపన జరిగేది కాదు.. అనవసరంగా భారీగా రవాణా చార్జీలు కూడా చెల్లించే అవసరం ఉండేది కాదు..' అని



పలువురు రైతులు తమ ఆవేదనను తెలియజేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని తమకు రైతు సేవ కేంద్రాల్లోని యూరియా పంపిణీ చేస్తే బాగుంటుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు

పలమనేరులో యూరియా కొరత లేదు

మండల వ్యవసాయ అధికారి సంధ్య

పలమనేరు మండలంలో యూరియా కొరత లేదని మండల వ్యవసాయ అధికారి సంధ్య సోమవారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. యూరియా కొరతపై వచ్చిన కథనాలపై ఆమె స్పందించారు. పలమనేరులోని ఎరువుల దుకాణాలపై నిరంతరం పర్యవేక్షణ ఉందని, కృత్రిమ డిమాండ్ సృష్టిస్తున్నారన్న వార్తల్లో నిజం లేదన్నారు. రైతులు కూడా కేవలం యూరియాపై ఆధార పడకుండా నానో యూరియా లేదా లిక్విడ్ యూరియా వాడితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ధర కూడా తక్కువని తెలిపారు.


అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఎంపిడివో పురుషోత్తం

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలం పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ పురుషోత్తం ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కి సమాచార హక్కు చట్టం(ఆర్టిఐ చట్టం)పై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పురుషోత్తం మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం, 2005 (ఆర్టిఐ యాక్ట్, 2005) భారత ప్రభుత్వం పౌరులకు సమాచారాన్ని పొందే హక్కును కల్పించే ఒక చట్టం అని, ఈ చట్టం 2005 అక్టోబర్ 12 నుండి అమలులోకి వచ్చిందని, దీని ద్వారా పౌరులు ప్రభుత్వ కార్యాలయాల నుండి ఏదైనా సమాచారాన్ని అభ్యర్థించ వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపీడీవో కోదండరామిరెడ్డి, ఏవో నాగమణి, అమండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాల య సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్‌పీని కలిసిన చక్రధర్ సిద్ధాంతి

ప్రజాశక్తి -వెదురుకుప్పం: తిరుపతి జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్‌పీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వెంకట నారాయణ ను ఎస్‌పీ కార్యాలయంలో ప్రముఖ జ్యోతిష్యులు చక్రధర సిద్ధాంతి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పోలీస్ శాఖలో వెంకటనారాయణ ఎన్నో అత్యున్నత మైన సేవలు అందించారని ప్రశంసించారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. డిఎస్పి వెంకట నారాయణ గతంలో వెదురుకుప్పం ఎస్‌ఐగా విధులు నిర్వ హించారన్నారు. చక్రధర సిద్ధాంతి (చంద్రమౌళి) వెదురు కుప్పం మండలంలోని గొడుగుచింత సర్పంచిగా ఆ పంచాయతీకి సేవలు చేశారు.

వైభవంగా పాలేటమ్మ తిరుణాల

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం నెల్లి మంద పంచాయతీ లో నిర్వహించిన పాలేటమ్మ తిరుణాల వైభవంగా సోమవారం ముగిసింది. ఆదివారం రాత్రి ఆలయం వద్ద 20 చాందిని బండ్లు సోమల, ఇరికిపెంట, నంజంపేట, నెల్లిమంద పంచాయతీల నుండి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేయించారు. సోమవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో బాణాసంచా కాల్చి పండుగను జరుపుకున్నారు. ఉదయం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరుకాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

డిప్యూటీ తహశీల్దారు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - ఎస్ ఆర్ పురం : ఎస్‌ఆర్‌పురం మండల డిప్యూటీ తహశీల్దారు త్యాగరాజు సోమవారం మండల కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కార్వేటి నగరం మండలం డిప్యూటీ తహశీల్దారుగా పనిచేసి బదిలీపై ఎస్‌ఆర్ పురం మండలానికి డిప్యూటీ తహశీల్దారుగా వచ్చారు. గతంలో ఆర్‌ఐగా ఎస్‌ఆర్ పురం మండలంలో పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల ప్రోత్సాహంతో ప్రజల సహకారంతో మండల అభివృద్ధికి, ప్రజలకు ఉత్తమ సేవ అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈవోకు అవార్డు

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : నాబార్డ్ 44వ వార్షికోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరి పీఏసీఎస్ సీఈవో తులసిపిళ్లై నాబార్డ్ అవార్డు అందుకున్నారు. విజయవాడ నాబార్డ్ రీజినల్ కార్యాలయంలో సోమవారం జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో సహకార శాఖ కమిషనర్ బాబు చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఉన్నత ప్రతిభా పాటవాలు ప్రదర్శించి నాబార్డ్ నిబంధనలను అనుసరించి బ్యాంకును ముందుకు తీసుకెళుతున్నందుకు ఆయనకు ఈ అవార్డు దక్కింది.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలం మదర్ థెరిసా విద్యాసంస్థలు ప్రాంగణంలో సోమవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల అకాడమీ అధికారి రాజేందర్ రడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ మనోహర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసకోవాల్సిన జాగ్రత్తలు ప్రమాదం జరిగిన వెంటనే చేయాల్సిన పనులు, ఆఫీస్‌కి సమాచారం అందించా లన్న విషయాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసు సిబ్బంది, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి: తహశీల్దారు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం :

అర్జీ దారులు అందించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తహశీల్దారు లోకనాథపిళ్లై అధికారులను ఆదేశించారు. మండల కేంద్రమైన ఎస్ఆర్‌పురం తహశీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా అర్జీలదారుల నుండి వివిధ సమస్యలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దారు లోకనాథ పిళ్లై మాట్లాడుతూ తమ రెవెన్యూ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం తహశీల్దారు కార్యాలయానికి సమస్యలతో పొజిషన్ సర్టిఫికెట్ కు 2, ముటేషన్ 2 , దారి సమస్యలపై ఒకటి అర్జీలతో కలిసి మొత్తం 5 అర్జీలు స్పందన కార్యక్రమానికి వచ్చాయని


అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దారు లోకనాథ పిళ్లై

తహశీల్దారు పేర్కొన్నారు. అందులో 3 సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించామని, మిగిలినవి దశల వారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్జీదారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

104 వాహన వైద్య సేవలు తనిఖీ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని కడపనాతం పంచాయతీలో గ్రామాల్లోని ప్రజలకు 104 ద్వారా డాక్టర్ శాలిని అధ్యక్షతన గ్రామాల్లో వైద్య సేవలు సోమవారం అందించారు. ఈ సందర్భంగా 104 వైద్య సేవలను జిల్లా మేనేజర్ ఆ వాహన పరిశుభ్రత, వాహన కండిషన్, వివిధ అంశాలపై వాహన డ్రైవర్ సమక్షంలో పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాలిని, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


104 వాహనం కండీషన్‌ను తనిఖీ చేస్తున్న అధికారి

చిత్రా నాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -యాదమరి: యాదమరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్‌గా చిత్రానాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఛైర్‌పర్సన్ తో పాటు సింగిల్ విండో డైరెక్టర్లుగా మహబూబ్ బాషా, ప్రభాకర్‌లను మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని సహకార సంఘం కార్యాలయంలో పిఎసిఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గుణ శేఖర్ పుష్పగుచ్ఛం అందించి


గజమాలతో సత్కరిస్తున్న ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ గుణశేఖర్

కార్యాలయంలోకి స్వాగతించారు. మండల స్థాయి అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తల మధ్య పిఎసిఎస్ ఛైర్‌పర్సన్ గా చిత్రా నాయుడు, డైరెక్టర్లు గా, మహబూబ్ బాషా, ప్రభాకర్ లు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షులు మొరార్జీ, ప్రధాన కార్యదర్శి రబ్బి, జిల్లా కార్యదర్శి హేమగిరి చిట్టి నాయుడు, అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథ్ నాయుడు, పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు, పిఏసిఎస్ ఛైర్‌పర్సన్ చిత్రా నాయుడుకి, గజపూల మాల వేసి, దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. యాదమరి తహశీల్దార్ పార్థసారథి, మండల అభివృద్ధి అధికారి వేణు, విద్యాశాఖ అధికారి రుక్మిణి, ప్రసాద్, ఉపాధి హామీ ప్రోగ్రాం అధికారిణి సంధ్యారాణి, వ్యవసాయ శాఖ అధికారి, దీప పలువురు మండల స్థాయి అధికారులు చైర్ పర్సన్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఎంపిటీసీలు ప్రజాప్రతినిధులు, టిడిపికి చెందిన నాయకులు, కార్యకర్తలు , పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న చిత్రానాయుడు

వర్షపు నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : వర్షం పడితే చాలు సిమెంట్ రోడ్డు చెరువును తలపిస్తోంది. మూడు రోజులుగా కురిసిన వర్షానికి వివిపురం రోడ్డు వర్షపు నీటితో నిండి వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందికరంగా మారిన సమస్యను ఎంపీడీవో మోహన మురళి తాత్కాలికంగా పరిష్కరించారు. రోడ్డుపై నిలబడిన వర్షపు నీరు స్థానిక సమస్యను స్థానికులు ఎస్ఆర్ పురం ఎంపీడీవో మోహన మురళి దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో కేశవులు, కొత్తపల్లి గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి జోత్స్న వారి సిబ్బందితో కలిసి మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట గ్రామంలో చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారి కొత్తపల్లి మిట్ట వాణిజ్య కూడలి నుండి వివి పురం గ్రామానికి వెళ్లే రోడ్డు పై వర్షపు నీరు నిల్వ ఉన్న విషయమై రోడ్డు పరిశీలించి తాత్కాలికంగా వర్షపు నీరు వెళువెళ్లేందుకు తగు ఏర్పాట్లు చేశారు. ఎస్ఆర్ పురం తహశీల్దారు లోకనాథ్ పిళ్లైతో చర్చించి ఆక్రమణలు తొలగించేందుకు తగు చర్యలు తీసుకుని శాశ్వతంగా మురికి కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వర్షపు నీటి సమస్యను పరిష్కరిస్తున్న ఎంపిడివో కార్యాలయ అధికారులు

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

ప్రజాశక్తి- రామకుప్పం: మండల శివార్లలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని కూటమి నేతలు పేర్కొన్నారు. సోమవారం గురుకుల పాఠశాలను కూటమి నేతలు సందర్శించారు. పాఠశాలలోని స్నానపు గదులు, మరుగుదొడ్లు సక్రమంగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం తెలుసుకొని పరిసరాలను పరిశీలించి పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల సమస్యలు వెంటనే తెలుసుకొని పరిష్కరించే విధంగా చొరవ చూపాలని ప్రిన్సిపాల్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకట్రామ గౌడు, టిడిపి మాజీ అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, నేతలు గుర్రప్ప, రఘు, శ్రీనివాసులు, సుబ్బన్న, ఎమ్మార్పీఎస్ నేతలు ప్రకాష్ ,వెంకటేష్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మాజీ ఎంపిపి హత్య కేసు దర్యాప్తు

ప్రజాశక్తి- తవణంపల్లి: తవణంపల్లి మండలం తెల్లగుండ్లపల్లిలో మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు రంగయ్య నాయుడు ఆదివారం రాత్రి దారుణ హత్యకు గురైన సంగతి విదితమే. దీనిపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు సోమవారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు రంగయ్యనాయుడును కాళ్లు, చేతులు తాడుతో బంధించి, మేడపై ఉరివేసి కిరాతకంగా హత్య చేశారు. సంఘటనా స్థలానికి వెళ్లిన డీఎస్పీ సాయినాథ్, వెస్ట్ సీఐ శ్రీధర్ నాయుడు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలో చిన్నపాటి గొడవ నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందన్న కోణంలో విచారణ కొనసాగిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ఊరిలోని కొంతమంది యువకులను పోలీసులు విచారిస్తున్నారు.

కాణిపాక వరసిద్ధి వినాయకుని సేవలో పిఎసిఎస్ ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి - యాదమరి: సింగిల్ విండో ఛైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించే ముందు చిత్రా నాయుడు కాణిపాక వరసిద్ధి వినాయకుడిని సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా యాదమరి ప్రాథమిక సహకార సంఘం ఛైర్‌పర్సన్ చిత్రా నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐరాల మండల మాజీ జడ్పిటిసి లతా బాబు, యాదమరి సింగల్ విండో డైరెక్టర్లు మహబూబ్ బాషా, ప్రభాకర్, ఐరాల ఎస్సీ సెల్ అధ్యక్షులు దేవరాజు, టిడిపి సీనియర్ నాయకులు నటరాజ్, యూనిట్ ఇన్‌చార్జి సోప్ప గణపతి, టిడిపి నాయకులు చిరంజీవి రాజేంద్ర మనీ, పాల్గొన్నారు .

కూటమి పాలనలోనే అభివృద్ధి: టిడిపి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు భరోసా కలిగించిందని మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్ అన్నారు. సోమవారం గంగాధర నెల్లూరు మండలంలోని పెద్ద కాల్వ, వేల్కూర్ పంచాయతీలలో 'సుపరిపాలన తొలి అడుగు ' కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో రాంబాబురెడ్డి, దీపక్ నాయుడు, ప్రసాద్ నాయుడు, సునీల్, దేవ సుందరం, హరీష్ యాదవ్, కోదండ రెడ్డి, లోకేష్ నాయుడు,ముని రాజ్ యాదవ్, జ్యోతి యాదవ్, బుజ్జి, జాన్ మునుస్వామి, సుబ్రహ్మణ్యం, చిదంబరం,లోకమ్మ పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పలమనేరు రూరల్ (గంగవరం): పలమనేరు మండలం కొలమాసనపల్లి పంచాయతీలో సుపరిపాలనకు తొలి అడుగును టీడీపీ నాయకులు సోమవారం ప్రారంభించారు. పంచాయతీ నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలపై ఆరా తీశారు. పంచాయతీ సమస్యలు తమ దృష్టికి తెస్తే మాజీ మంత్రి, ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి వివరించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటీసీ వెంకట రత్నం, మండల ప్రధాన కార్యదర్శి గణేష్, మాజీ సర్పంచులు సెల్వరాజు, హేమసుందరం, సీనియర్ నాయకులు సెల్వరాజు, వెంకటేశు, షరీఫ్, దేవేంద్ర, మణి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

పూతలపట్టు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా పూతలపట్టు మండలం, పి.కొత్తకోట పంచాయతీలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం


కొలమాసనపల్లిలో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

చుట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కరపత్రాల ద్వారా వివరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులను, సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆధునీకరణ పనులు, పశు వైద్యశాలలో ఆధునీకరణ పనులను, సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఆధునీకరణ, మౌలిక వసతుల పనులు ఆయన ప్రారంభిం చారు. డి మిట్టూరులో సీసీ రోడ్డును ప్రారంభించారు. సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహంలో అదనంగా రెండు గదులు అవసరమని ఎమ్మెల్యేను అధికారులు కోరారు. మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పూతలపట్టు నియోజకవర్గం రూ. 230 కోట్లలకు పైగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించామని ప్రస్తుతం రూ. 130 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియూసీ రాష్ట్ర కార్యదర్శి యువరాజుల నాయుడు, పూతలపట్టు మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి, చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ చంద్రబాబు నాయుడు, మాజీ జెడ్పీటీసీ బాబురావు, నాయకులు నేతాజీ, మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి -రొంపిచర్ల : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని విశ్రాంత ప్రిన్సిపాల్ రమేష్ అన్నారు. ఆయన తన తండ్రి చట్నా నారాయణ వర్ధంతి సందర్భంగా పాఠశాల విద్యార్థులకు బహుమతులను అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని రకాల వసతులను కల్పిస్తోందని అన్నారు. దీన్ని విద్యార్థులు దృష్టిలో పెట్టుకొని బాగా చదువుకోవాలన్నారు. తన తండ్రి చట్నా నారాయణ జ్ఞాపకార్థం మంచి మార్కులను సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. తాము కూడా ఇక్కడే చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకున్నామని అన్నారు. అనంతరం విద్యార్థులకు నగదు పురస్కారాలు, అవార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రొంపిచర్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి, అమర శేఖర్, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాల మహానాడు కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలం మాల మహానాడు నూతన కార్యవర్గాన్ని రాయలసీమ జోన్ అధ్యక్షులు కెళవాతి సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రచార కార్యదర్శి తిప్పయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండల మాల మహానాడు గౌరవ అధ్యక్షులుగా బ్రాహ్మణ పల్లి తిరువలప్ప, మండల అధ్యక్షులు టియం మంజునాథ్, ప్రధాన కార్యదర్శి రామచంద్ర, కార్యనిర్వాహక కార్యదర్శులు గా జయరాం, నాగార్జున, కార్యదర్శిగా సత్యసాయి కుమార్, శివయ్య, కోశాధికారిగా కృష్ణమూర్తి, చిన్న, సలహా దారులు గా రంగప్ప, సోమును ఎన్నుకున్నారు.

సమాచార హక్కు చట్టంపై సందేహాలు నివృత్తి

ప్రజాశక్తి -శాంతిపురం:

శాంతిపురం మండలం మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం -2005 పై మండల పరిషత్ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు హరిత, న్యాయవాది, కుప్పం ఎపిఆర్ కుమార్ ఎంపీడీవో అధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సదస్సు లో పలు అంశాల పై అవగాహన కల్పించి సిబ్బంది అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు.

క్రైం న్యూస్


లారీ అదుపు తప్పి బోల్తా పడిన దృశ్యం

అదుపు తప్పి లారీ బోల్తా

తృటిలో తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: లారీ అదుపు తప్పి తృటిలో పెను ప్రమాదం తప్పిన సంఘటన మండలంలోని శేషాపురం వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు .. పలమనేరు నుండి చిత్తూరు వైపు కొత్తమిరి కట్టల లోడుతో వెళుతున్న ఈచర్ వాహనం అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్లఫారంలో చోరీ

ప్రజాశక్తి -కార్వేటినగరం: పట్ట పగలే కోళ్లఫారంలో చోరీకి పాల్పడ్డ సంఘటన సోమవారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం సమీపంలోని సుద్దగుంట వద్ద కోళ్లపారంలో చోటు చేసుకుంది. కోళ్లఫారం యజమాని సాయికుమార్ కథనం మేరకు ..సుద్దగుంట సమీపంలో ఉన్న కోళ్లఫారంలో సుద్దగుంట గ్రామానికి చెందిన గురవయ్య, లక్ష్మీపతి, సుబ్రహ్మణ్యం పట్టపగలే కోళ్లఫారం తలుపులు పగల గొట్టి సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి అందులోని గ్యాస్ సిలిండర్, వంద కోళ్ళు, ఇనుపరాడ్లు, ఫారంలో వాడే ఫీడర్లను అపహరించినట్లు సీసీ పుటేజీల ఆధారంగా గుర్తించి వారిని అక్కడికక్కడే పట్టుకున్నట్లు తెలిపారు. దీంతో వారిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై దాడి

నిర్వాహకులపై కేసు నమోదు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని చెర్లోపల్లి గ్రామం వద్ద అసాంఘిక కార్యకలాపాలకు (వ్యభిచార గృహం) పాల్పడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. స్థానిక పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పెద్ద కాలువ పంచాయతీ చెర్లోపల్లి గ్రామం వద్ద ఓ ఇంటిని అద్దెకు తీసుకొని విజయ అక్రమంగా ఇతర రాష్ట్రాల నుండి మహిళలను పిలిపించుకొచ్చి అసాంఘిక కార్యకలాపాలు (వ్యభిచారం) నిర్వహిస్తున్నారని సమాచారం అందుకున్న గంగాధర నెల్లూరు పోలీసులు వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకులను, ముగ్గురు మహిళలను, ఇద్దరు విటులను పట్టుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీడీ నెల్లూరు సీఐ శ్రీనివాసంతి తెలిపారు.

నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్ట్ చేశామని పలమనేరు డిఎస్‌పి డేగ ప్రభాకర్ సోమవారం తెలిపారు. గత నెల 14వ తేదీ బంగారుపాలెం మండలం తుంబుకుప్పం గ్రామంలో రామ్ విలాస్ పాశ్వాన్ పై అదే గ్రామానికి చెందిన అబ్దుల్ మాలిక్ కుమారుడు అహ్మద్ బాషా హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో రామ్ విలాస్ పాశ్వాన్‌కు కత్తితో దాడి చేయడం వల్ల తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం మండలంలోని పాలేరు ఫ్లై ఓవర్ వద్ద వుండగా నిందితుడు అహ్మద్ బాషాను పోలీసులు అదుపులో తీసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించి రిమాండ్‌కు పంపామని తెలిపారు. ఈ సమావేశంలో సిఐ కత్తి శ్రీనివాసులు, ఏఎస్‌ఐ మల్లప్ప, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.